సాక్షి అనకాపల్లి

బుధవారం । 14 । ఆగస్టు । 2024



హిచ్‌కాక్‌కు నివాళి

విశాఖ: ప్రపంచ మేటి సినీ దర్శకుడు ఆల్‌ఫ్రెడ్ హిచ్ కాక్ 125వ జయంతిని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.



కాఫీ పొడితో కళాకృతులు

విశాఖ: చిత్రకారుడు నాయిన సురేష్ ఆధ్వర్యంలో అగనంపూడిలోని ఏజీఎస్ పాఠశాల విద్యార్థులు కాఫీ పొడితో కళాకృతులు రూపొందించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉండి తేలకపాటి జల్లులు పడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం పేర్కొన్నారు. ఈనెల 14న 10 మి.మీ, 15న 10, 16న 8, 17న 10, 18న 14 మి.మీ వర్షపాతం నమోదవుతుందన్నారు. ఉష్ణోగ్రతలు 35 నుంచి 35.4 డిగ్రీలు నమోదవుతాయని చెప్పారు.

మువ్వన్నెలు మురిశాయి..



మాడుగులలో 75 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జాతీయ జెండా రెపరెపలాడింది. గుండె నిండా దేశభక్తి నిండగా.. పిల్లలు పెద్దలు తేడా లేకుండా 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలతో హోరెత్తించారు. విశాఖ బీచ్ రోడ్డులో మంగళవారం 'హర్ ఘర్ తిరంగా' యాత్ర నిర్వహించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, పోలీస్ జాయింట్ కమిషనర్ ఫకీరప్పతో కలిసి కలెక్టర్ జెండా ఊపి.. యాత్రను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా యాత్రలో పాల్గొని.. నినదించారు. ప్రతిజ్ఞ అనంతరం మువ్వన్నెల జెండా చేత బట్టి ముందుకు సాగారు. మాడుగులలో భారత నిర్మాణ సేన ఆధ్వర్యంలో విద్యార్థులు 75 మీటర్ల జాతీయ జెండాను ఆవిష్కరించారు. వందేమాతరం అంటూ ర్యాలీ నిర్వహించారు. మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

–బీచ్ రోడ్డు (విశాఖ), మాడుగుల



విశాఖ తీరంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

సమ్మె సైరన్

- 4 నెలలుగా 165 మంది కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించని వైనం
- ఎన్టీఆర్, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రితో పాటు 6 సీహెచ్‌సీల్లో ఇదే స్థితి
- తమవారిని నియమించుకునే యత్నం
- జీతాలు చెల్లించని పక్షంలో వచ్చే నెల 15 నుంచి సమ్మె తథ్యం
- డీసీహెచ్‌ఎస్‌కు సమ్మె నోటీసు ఇచ్చిన కాంట్రాక్ట్ కార్మిక సంఘం

మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులపై

కూటమి కుట్ర

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది పట్ల కూటమి నేతల కుట్రలు కొనసాగుతున్నాయి. నాలుగు మాసాలుగా వారికి జీతాలు చెల్లించకుండా కుయుక్తులు పన్నుతున్నారు. రోజు వారీ విధుల కన్నా.. అదనంగా పనిచేయించుకుంటున్న ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు, జీతాల కోసం అడిగితే సంబంధం లేదంటున్నారు. గత ప్రభుత్వంలో నియమించిన సిబ్బందికి తామెందుకు జీతాలిస్తామంటూ కూటమి నేతలు వింత వాదన తెస్తున్నారు. పైపెచ్చు మీరు ఉద్యోగాలు వదిలేయండి, మా వాళ్లను తెచ్చుకుంటామంటూ బెదిరిస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల 1వ తేదీలోగా జీతాలు చెల్లించకపోతే 15 నుంచి సమ్మెకు దిగనున్నట్లు మెడికల్ కాంట్రాక్ట్ కార్మిక యూనియన్ హెచ్చరించింది. ఈ మేరకు మంగళవారం డీసీహెచ్‌ఎస్‌కు సమ్మె నోటీసిచ్చింది.

సాక్షి, అనకాపల్లి:

జిల్లాలోని ప్రధాన ఆస్పత్రి అయిన ఎన్టీఆర్ వైద్యాలయం, నర్సీపట్నంలోని ఏరియా ఆస్పత్రితో పాటు, ఆరు సీహెచ్‌సీల్లో పనిచేస్తున్న 165 మంది కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు కూటమి ప్రభుత్వం రాకతో అయోమయంలో పడ్డాయి. నెలల తరబడి జీతాల్లేక, కుటుంబాలు అల్లాడుతున్నాయి. ఎప్పుడు జీతమిస్తుందో తెలియని పరిస్థితుల్లో అప్పు కూడా దొరకట్లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాల కోసం కార్మిక శాఖ జిల్లా అధికారికి కూడా మొరపెట్టుకున్నా ఫలితం కనిపించలేదు. ఉన్న పనికన్నా అదనపు పని చేయించుకుంటూ, జీతాల కోసం ఇన్ని ఇబ్బందులు పెట్టడం సరికాదని కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ ప్రతినిధులు వాపోతున్నారు.

వచ్చే నెల 1 జీతాలకు డెడ్‌లైన్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో సమ్మె బాట పట్టేందుకు నిర్ణయించారు. ఈ మేరకు డీసీహెచ్‌ఎస్, ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ ఉద్యోగులు సమ్మెనోటీస్ ఇచ్చారు. సెప్టెంబర్ 1లోపు జీతాలు చెల్లించకపోతే ఉద్యమిస్తామంటూ డెడ్‌లైన్ విధించారు. సెప్టెంబర్ 15 నుంచి విధులను బహిష్కరిస్తామని ఆ నోటీస్‌లో హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు వరకు సకాలంలో జీతాలిచ్చారని, ఎన్నికల నోటిఫికేషన్ తరువాత నుంచి జీతాలు చెల్లించట్లేదని వాపోయారు.

దళారీ వ్యవస్థతో కార్మికులకు నష్టం

దళారీ వ్యవస్థ కారణంగా కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతోంది. ఒక్కో ఏరియాలో ఒక్కో రకంగా జీతం ఇస్తున్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికుడికి రూ.10 వేలు ఇస్తుంటే, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో రూ.9 వేలు, సీహెచ్‌సీల్లో రూ.8 వేలు మాత్రమే ఇస్తూ వచ్చారు. సమాన పనికి, సమాన జీతం ఇవ్వాలంటూ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కాంట్రాక్ట్ విధానంలో తామేం చేయలేమని, నిబంధనల మేరకు వారికి చెల్లింపులు జరుగుతాయని, వారెంతిస్తారో మాకు సంబంధం లేదంటూ ఆస్పత్రి యాజమాన్యం చేతులెత్తేస్తోంది.

కోటపాడు సీహెచ్‌సీలో అదనపు శ్రమ

కోటపాడు సీహెచ్‌సీలో పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 వరకు పనిచేయాలి. సిబ్బంది కొరత కారణంగా ఉదయం 6 గంటలకు డ్యూటీ ఎక్కితే సాయంత్రం 4 దాటేంత వరకూ డ్యూటీ చేయిస్తున్నారు. డైలీ అవర్స్ కన్నా అదనంగా వర్క్ చేయించుకుంటున్నారు. ఆస్పత్రిని శుభ్రం చేసేందుకు అవసరమైన చీపుర్లు, టాయిలెట్ క్లీనింగ్ ఫినాయిల్ వంటివి కూడా అరకొరగానే ఇస్తున్నారని కాంట్రాక్ట్ కార్మికులు వాపోతున్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వివరాలు

- జిల్లా వ్యాప్తంగా అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి, నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి, కోటవురట్ల, నక్కపల్లి, మాడుగుల, యలమంచిలి, చోడవరం, కోటపాడు సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులున్నారు.
- ఎన్టీఆర్ ఆస్పత్రిలో 30 మంది పారిశుధ్య కార్మికులు, 25 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు.
- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 20 మంది పారిశుధ్య కార్మికులు, 10 మంది సెక్యూరిటీ సిబ్బంది విధుల్లో ఉన్నారు.
- మిగిలిన ఆరు సీహెచ్‌సీల్లో పారిశుధ్యం, సెక్యూరిటీ విధుల్లో 80 మంది పనిచేస్తున్నారు.



అనకాపల్లి డీసీహెచ్‌ఎస్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్ట్ కార్మికులు

కలెక్టర్ గారూ.. జీతాలిప్పించరూ..



మూడు నెలలుగా జీతాల్లేక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. దీని పైనే ఆధారపడి బతుకుతున్న మాకిచ్చే రూ.10 వేలు కూడా ఇవ్వకపోతే కుటుంబాన్ని ఎలా నెట్టుకొచ్చేది. అధికారులందరినీ కలిసి మా గోడు వెళ్లబోసుకున్నాం. కలెక్టర్ చొరవ తీసుకుని వెంటనే మా జీతాలు చెల్లించాలని వేడుకొంటున్నా.

– పెద్దపూడి సత్యవతి, పారిశుధ్య కార్మికురాలు, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి

పని చేయించుకుని.. సంబంధం లేదంటే ఎలా?



ప్రభుత్వం మారినప్పుడల్లా కార్మికులను తొలగించే ప్రక్రియ సరికాదు. డ్యూటీ సమయం కన్నా.. అదనంగా మూడు నుంచి నాలుగు గంటలు పని చేయించుకుంటున్నారు. కానీ జీతాలివ్వట్లేదు. పనులు చేయించుకుంటున్న ఆస్పత్రి సూపరింటెండెంట్లు జీతాల గురించి అడిగితే మాత్రం తమకు సంబంధం లేదంటున్నారు. తక్షణమే మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు చెల్లించాలి. లేదంటే ఆకలితో అలమటిస్తున్న మేము సమ్మె చేయక తప్పదు.

– కోన లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్

రెవెన్యూ సదస్సుల పేరుతో పచ్చ ప్రచారం

- గత ప్రభుత్వంపై విషం చిమ్మడమే లక్ష్యం
- నాడు జారీ చేసిన పాసు పుస్తకాలు స్వాధీనం చేసుకొని సర్వే రాళ్లు తొలగించడానికే ప్రాధాన్యం

నక్కపల్లి: ఈనెల 16 నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఎమ్మెల్యేలను, మంత్రులను ఇందులో భాగస్వాములను చేసి, భారీ ఎత్తున సదస్సులు జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రజలకు మేలు చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడితే మంచిదే కానీ.. గత ప్రభుత్వంపై విషం చిమ్మడమే లక్ష్యంగా చేస్తున్న ప్రయత్నం అయితే మాత్రం ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుంది. ఈ సదస్సుల నిర్వహణపై విస్తృత ప్రచారం చేయాలని కరపత్రాలను, పోస్టర్లను ముద్రించి అన్ని గ్రామాలకు పంపిస్తున్నారు. ఇందు కోసం జిల్లాకు రూ.10 లక్షల చొప్పున బడ్జెట్ కేటాయింపులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం జన్మభూమి, ప్రజల వద్దకు పాలన వంటి కార్యక్రమాలను నిర్వహించింది. వీటి ద్వారా ప్రజలకు ఉపయోగపడే ఎటువంటి కార్యక్రమాలను చేపట్టకపోగా ప్రజాధనాన్ని విచ్చల విడిగా ఖర్చు చేసి విస్తృత ప్రచారం చేసుకుంది. తాజాగా ఇదే విధానానికి కూటమి సర్కారు తెర తీసి మరోసారి ప్రజాధనం వృథా చేసేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్న వాదన వినిపిస్తోంది.

రైతుల దృష్టిని మరల్చేందుకే..

అసైన్డ్ ల్యాండ్‌లపై రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి హక్కులు కల్పించింది. ఈ భూములను 22 ఏ జాబితా నుంచి తొలగించి క్రయవిక్రయాలు చేసుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో ఎప్పుడో దశాబ్దాల క్రితం ప్రభుత్వం నుంచి డీ ఫారం భూములు పొందిన రైతులకు వాటిపై సంపూర్ణ హక్కులు లభించాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఫ్రీ హోల్డ్ ల్యాండ్ విధానాన్ని రద్దు చేసింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతుల దృష్టిని మరల్చేందుకే ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం సమగ్ర భూసర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించి సర్వే రాళ్ల ఏర్పాటు చేయించింది. సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేసింది. ప్రస్తుత ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల్లో గత ప్రభుత్వం రైతులకు జారీ చేసిన పట్టాదారు పాసు పుస్తకాలను స్వాధీనం చేసుకోవడం, సర్వే రాళ్లపై ఉన్న లోగోలు, పేర్లు చెరిపేసి వాటిని తొలగించడానికే ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఈ రెండు కార్యక్రమాలు కచ్చితంగా చేయాలని ఇప్పటికే తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేసినట్లు భోగట్టా. పైకి మాత్రం రైతులకు సంబంధించి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించడం, రశీదులు ఇచ్చి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం కోసమేనని చెబుతున్నప్పటికీ వాస్తవం మాత్రం గత ప్రభుత్వంపై ప్రజల్లో తప్పుడు ప్రచారం చేయడం కోసమేనన్న వాదన వినిపిస్తోంది.

సమస్యలు పరిష్కరించని సదస్సులు ఎందుకో..?

- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న



దేవరాపల్లి: సమస్యలు పరిష్కరించని రెవెన్యూ సదస్సులు ఎందుకని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న విమర్శించారు. దేవరాపల్లి సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 16 నుంచి 15 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి, సదస్సుల్లో వచ్చిన సమస్యలను 40 రోజుల్లో పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని ఆయన తప్పుపట్టారు. గతంలో కూడా చంద్రబాబు హయాంలో ఇదే మాదిరిగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు తప్ప సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఈ రెవెన్యూ సదస్సులతో సమయం వృథా తప్పా ప్రజలకు ఒరిగిందేమి ఉండబోదన్నారు. ఆధారాలతో సహా అక్రమాలను ప్రజలు చూపిస్తే అధికారులు పరిష్కరించకుండా కాలయాపన చేస్తుండటమే ఇందుకు నిదర్శనమన్నారు. దేవరాపల్లిలోని సర్వే నెంబర్ 20లో 38 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు తీర్పు ఇచ్చి రెండేళ్లు గడిచినా ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ఆయన అధికార్లను సూటిగా ప్రశ్నించారు. తహసీల్దార్‌పై కోర్టు ధిక్కరణ కేసు ఎందుకు వేయకూడదని ప్రశ్నించారు. వి.మాడుగుల మండలంలోని ఉరలోవ కొండ చుట్టూ దాదాపుగా 450 మందికి 12 ఏళ్ల క్రితం డీ పట్టాలు ఇచ్చిన భూములను నేటికీ ఆన్‌లైన్ చేయకపోగా కనీసం సర్వే నెంబర్ కూడా సక్రమంగా వేయలేదన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో భూ సమస్యలపై సిట్ వేసి ఫిర్యాదులు స్వీకరించి ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని ఎద్దేవా చేశారు.

త్వరలో ఎన్టీఆర్ వైద్యాలయంలో సీటీ స్కాన్ పరికరం



మాత శిశు వార్డులో రోగితో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ రమేష్ కిషోర్

అనకాపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో సీటీ స్కాన్ మిషన్‌ను రోగులకు అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ జాయింట్ కమిషనర్ రమేష్ కిషోర్ చెప్పారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో వివిధ విభాగాలను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆస్పత్రిలో రోగులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలని సూచించారు. మాతా శిశు వార్డుల్లో రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని, రోగుల సంఖ్యను బట్టి బడ్జెట్‌ను త్వరలో కేటాయించడం జరుగుతుందన్నారు. డీసీహెచ్‌ఎస్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదికకు 15 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఫోరం చైర్‌పర్సన్ సత్యనారాయణ, ఫోరం సభ్యులు

నర్సీపట్నం: విద్యుత్ సమస్యల పరిష్కర వేదిక సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పరిష్కార వేదిక చైర్‌పర్సన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ పేర్కొన్నారు. డివిజినల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయ ఆవరణలో మంగళవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వినియోగదారుల నుంచి చైర్‌పర్సన్ ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన సమస్యలపై వెనువెంటనే అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వోల్టేజీ హెచ్చు తగ్గులు, విద్యుత్ మీటర్‌లో లోపాలు, బిల్లులలో లోపాలు, విద్యుత్ తీగల మరమ్మతులు వంటి సమస్యలపై 15 ఫిర్యాదులు ఫోరం దృష్టికి వచ్చాయన్నారు. క్షేత్రస్థాయిలో కొన్ని సమస్యలను పరిష్కరించటం జరిగిందన్నారు. వినియోగదారుడు ఇచ్చే ప్రతీ ఫిర్యాదుకు ఫోరంలో పరిష్కారం లభిస్తుందన్నారు. వినియోగదారుని సమస్య సకాలంలో పరిష్కరించకపోతే సేవ అమలులో జాప్యానికి పరిహారం చెల్లించే విధంగా ఫోరం న్యాయం చేస్తుందన్నారు. పైసా ఖర్చు లేకుండా ఫోరం ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. అధికారుల వద్ద మీ సమస్యకు పరిష్కారం లభించకపోతే వెంటనే ఫోరం దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఫోరం ఆర్థిక సభ్యులు ఎం.శ్రీనివాస్, సాంకేతిక సభ్యులు బి.జనార్దన్‌రావు, డీఈ రామకృష్ణారావు, డీఈఈ ఎస్.సునీల్ కుమార్, ఏడీఈ సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రంగురాళ్ల క్వారీ ప్రాంతాల తనిఖీ



క్వారీ ప్రాంతాలను పరిశీలిస్తున్న పోలీసు, అటవీశాఖ సిబ్బంది

గొలుగొండ : సాలికమల్లవరం ప్రాంతంలో రంగురాళ్ల క్వారీ ప్రాంతాలను గొలుగొండ ఎస్‌ఐ బి. కృష్ణారావు, అటవీశాఖ సిబ్బంది మంగళవారం పరిశీలించారు. సాలికమల్లవరం గ్రామ సమీపంలో ఉన్న రంగురాళ్ల క్వారీ సమీపంలో మళ్లీ తవ్వకాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కృష్ణారావు మాట్లాడుతూ సాలికమల్లవరం ప్రాంతంలో తవ్వకాలు జరగకుండా అటవీ, పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోవడం జరుగుందని తెలిపారు. ఈ ప్రాంతంలో తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రో హోమియోపతిక్ రాష్ట్ర అధ్యక్షునిగా శ్రీధర్



యలమంచిలి రూరల్ : జాతీయ ఎలక్ట్రో హోమియోపతిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా యలమంచిలికి చెందిన సుసరపు శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు కె.పి.ఎస్ చౌహాన్ నియామక సమాచారాన్ని తనకు పంపించారని డాక్టర్ శ్రీధర్ మంగళవారం రాత్రి మీడియాకు తెలిపారు. రాష్ట్ర ఎలక్ట్రో హోమియోపతిక్ అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తానని తమ రంగానికి చెందిన వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఎలక్ట్రో హోమియోపతిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా నియమించబడిన శ్రీధర్‌ను పలువురు మెడికల్ ప్రాక్టిషనర్లు అభినందించారు. త్వరలోనే ఎలక్ట్రో హోమియోపతిక్ అసోసియేషన్ సభ్యులందరికీ గుర్తింపు కార్డులు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

మాలధారణం..సంతోషిమాత కృపాకటాక్షం

- 16వ తేదీ నుంచి సంతోషిమాత మాలధారణ
- కేజేపురం జంక్షన్‌లోని అమ్మవారి ఆలయంలో
- ఈ నెల 30 వరకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత అమ్మవారు



సంతోషిమాత మాలధారణలో భక్తులు (ఫైల్)

మాడుగుల రూరల్ : పౌర్ణమి నాడు శ్రావణ నక్షత్రం ఉంటుంది. కావున ఈ నెలకు శ్రావణం అని పేరు. శ్రీ మహావిష్ణువు జన్మ నక్షత్రం శ్రావణమే. అందుకే అది శ్రీ మహావిష్ణువుకు ఎంతో ఇష్టమైన మాసం. ఈ మాసంలో సంతోషిమాత మాలధారణ చేయడం అనవాయితీ. మండలంలో కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత అమ్మవారి ఆలయంలో ఈ నెల 9వ తేదీ నుంచి అమ్మవారికి తొలి శ్రావణ శుక్రవారం సందర్భంగా పూజలు చేశారు. ఈ నెల 16వ తేదీన అమ్మవారి మాలధారణ ప్రారంభిస్తారని ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు తెలిపారు. ఈ ఆలయంలో గత 20 ఏళ్లుగా ఏటా అమ్మవారి మాలదారణ జరుగుతుంది. తొమ్మిది రోజుల పాటు దీక్షధారులు పసుపు వస్త్రాలు ధరించి, ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, చన్నీటి స్నానం ఆచరించి, అమ్మవారికి మూడు పూటలు పూజలు నిర్వహించడం జరుగుతుంది. ఉదయం, రాత్రికి చద్ది (అల్పాహారం), మధ్యాహ్నం భోజనం భుజిస్తారు. దీక్షా సమయంలో కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాలు విడనాడి, ఎనిమిది రోజుల పాటు దీక్ష చేపట్టి, తొమ్మిదో రోజు ఇరుముడి ధరించి, అమ్మవారి ఆలయం వద్ద ఇరుముడులు అమ్మవారికి సమర్పించడంతో దీక్ష ముగుస్తుంది.

ఆలయం దినదినాభివృద్ధి

సంతోషిమాత అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు, గోమాతకు పూజలు, ఆలయం చుట్టూ భక్తుల ప్రదర్శనతో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి. ఈ ఆలయం 1995లో కె.జె.పురం జంక్షన్ వద్ద నిర్మించారు. కమ్మలపాకలో అమ్మవారి విగ్రహానికి పూజలు జరిగేవి. తర్వాత అమ్మవారికి ఆలయం నిర్మించారు. 2005 నుంచి ఆలయ చైర్మన్‌గా కాళ్ల అమ్మతల్లినాయుడు బాధ్యతలు స్వీకరించి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. భక్తులు, దాతల సహకారంతో ఆలయంలో ప్రతి శుక్రవారం అన్న సమారాధన ప్రారంభించారు. 2021 నుంచి ఆలయం పక్కన నిత్యాన్నదానం జరుపుతున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం బాటసారులు, ప్రజలకు ఇక్కడ కనీసం రోజుకు 150 మందికి పైగా అన్నదానం జరుగుతుంది. ఈ అన్నదాన సత్రానికి కె.జె.పురం గ్రామానికి చెందిన కీర్తి శేషులు మారుముఖం కొండమ్మ ఉచితంగా స్థలం ఇచ్చారు. కాగా అమ్మవారి తీర్థం ప్రతి ఏటా ఫిబ్రవరి మాసంలో ఘనంగా నిర్వహిస్తారు.

శ్రావణం..పరమం పవిత్రం

శ్రావణమాసం పురస్కరించుకుని ఆలయంలో ఈ నెల 9, 16, 23, 30 వ తేదీల్లో నాలుగు శ్రావణ శుక్రవారాల్లో ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ నెల 16 వ తేదీ నుంచి ఆలయ ప్రధాన ఆర్చకులు దొంతుకుర్తి శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో ఆలయం వద్ద భక్తులకు మాలధారణ చేస్తారు. తొమ్మిది రోజులు పాటు మాలధారణ భక్తులకు ఆలయం వద్ద చద్ది, భిక్ష, ఆలయ కమిటీ ద్వారా ఏర్పాటు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు

ప్రతి ఏటా శ్రావణ మాసంలో సంతోషిమాత అలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తారు. అమ్మవారి జన్మదిన వేడుకలు కూడా నిర్వహించడం పరిపాటి. గత 20 ఏళ్లుగా ఏటా శ్రావణమాసంలో అమ్మవారి దీక్షల కార్యక్రమం జరుగుతుంది. దీక్షధారుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది. 2006 నుంచి దీక్షలు చేపట్టడం ప్రారంభం అయింది. శ్రావణ శుక్రవారాలు నాలుగు వారాలు ఆలయం వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీనికి తగ్గ అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం.

–కాళ్ల అమ్మతల్లినాయుడు, ఆలయ కమిటీ చైర్మన్, కె.జె.పురం

విశిష్ట దీక్షలు



శ్రావణమాసంలో రాఖీ పండగ రోజున సంతోషి మాత అమ్మవారి జన్మించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ ఆలయంలో అమ్మవారి దీక్షలు చేపట్టడం జరుగుతుంది. పీఠాధిపతులు, పెద్దల సలహా మేరకు అమ్మవారి దీక్షలు ప్రతి ఏటా శ్రావణ మాసంలో చేపడుతున్నారు.

–దొంతుకుర్తి శ్రీనివాసశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు, కేజేపురం సంతోషిమాత దేవాలయం

ఏటా పెరుగుతున్న భక్తులు



శ్రావణ మాసంలో అమ్మవారి దీక్షలు చేపట్టే భక్తుల సంఖ్య పెరుగుతుంది. ప్రారంభంలో 2006లో 16 మంది మంది దీక్ష చేపట్టగా, నేడు అ సంఖ్య భారీగా పెరిగి కనీసం 200 మంది మాలధారణ చేసి తమ భక్తిని చాటుకుంటున్నారు.

– ఆదారి శివకేశవ, కె.జె.పురం గ్రామం

నీళ్లబందకు కరెంటివ్వండి..

- గిరిజనుల వినూత్న నిరసన



కాగడాలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

రోలుగుంట : స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలైనా రోలుగుంట మండలం అర్ల పంచాయితీ కొండ శిఖరం గ్రామం అయిన నీళ్లబంద ఆదివాసీ గ్రామస్తులు మాత్రం విద్యుత్ సౌకర్యానికి నోచుకోలేదు. దీనిపై ఆ గ్రామానికి చెందిన గిరిజనులు మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దీనికి నాయకత్వం వహించిన సీపీఎం జిల్లా నాయకుడు కె.గోవింద మాట్లాడుతూ అన్ని వసతులతో మైదాన, పట్టణ ప్రాంతాలు స్వేచ్ఛగా జీవిస్తున్నారు..కానీ ఆదీవాసీలపై చిన్నచూపు పోలేదన్నారు. చంద్రమండలంలో వెలుతురుతో అడుగిడుతున్నా మనిషి భూమండలంలో మా గ్రామంలో మాత్రం చీకట్లోనే మగ్గుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోలుగుంట మండలం అర్ల పంచాయతీ శివారు ఆదివాసీ గ్రామమైన నీళ్లబందలో ఆరు కుటుంబాలకు చెందిన 25 మంది జనాభా ఉన్నారు. చీకటిలో మగ్గుతున్న తమ గ్రామానికి కరెంటు సౌకర్యం కలిపించకపోతే దశల వారీగా నిరసనలు ఉధృతం చేయాల్సి ఉంటుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో గిరిజ నాయకుడు గెమ్మిలి సత్తిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్యాస్, చమురు ఉత్పత్తులపై పన్నుల్లో వాటా ఇవ్వాలి



నెహ్రూచౌక్ వద్ద వామపక్ష, ప్రజా సంఘాల ధర్నా

అనకాపల్లి : రాష్ట్ర పరిధిలో తూర్పుగోదావరి-కృష్ణా జిల్లా తీర ప్రాంతాల్లో వెలికి తీస్తున్న సహజ వాయువు, చమురు ఉత్పత్తులపై పన్ను విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉండాలని, వచ్చే ఆదాయంలో 50 శాతం రాష్ట్రానికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ కమ్యూనిస్టు, వామపక్ష పార్టీలు ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కాకినాడకు 30 కిలోమీటర్ల దూరాన సముద్ర గర్భం నుంచి 2024, జనవరి 7న ముడి చమురు ఉత్పత్తి ప్రారంభమైందని, కృష్ణ గోదావరి బేసిన్‌లో గ్యాస్‌తో బాటుగా చమురు నిల్వల విలువ రూ.లక్షల కోట్లు ఉంటుందని తెలిపారు. ఈ సహజ వనరులను దేశ సంక్షేమానికి ఉపయోగించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని కాకపోతే ఆ వనరులు ఉన్న ప్రాంతానికి న్యాయబద్ధంగా రావలసిన వాటా ఇవ్వవలసి ఉందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో సహజ వనరులు బయట పడినా దానిని మోదీ, అమిత్ షాలు, అదానీ, అంబానీలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి రావలసిన హక్కులు, న్యాయమైన ఆర్థిక నిధుల కోసం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ వామపక్ష పార్టీలతో కలిసి ఉద్యమాల్లో పాల్గొంటుందని అన్నారు. ప్రభుత్వాల అండతో సహజ వనరులు రిలయన్స్ లాంటి కార్పొరేట్ కంపెనీల పాలవుతున్నాయని, మన తీర ప్రాంతంలో చమురు ఉత్పత్తి ఆంధ్ర ప్రజల ఆర్థికాభివృద్ధికి చాలా కీలకమైనదని వారు పేర్కొన్నారు. సహజ వనరులు ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రానికి ఉత్పత్తిలో 50 శాతం కేటాయించాలని 12వ ఫైనాన్స్ కమిషన్ కూడా చెప్పిందన్నారు. పార్లమెంట్‌లో రాష్ట్ర ఎంపీలు మన న్యాయమైన డిమాండ్లను ఎలుగెత్తి చాటాలన్నారు. ఈ నిరసనలో కమ్యూనిస్టు, వామపక్షాల జిల్లా నాయకులు రాజాన దొరబాబు, బి.శంకరరావు, ఐఆర్.గంగాధర్, సవరాలు గణేష్, పి.ఎస్.అజయ్‌కుమార్, జి.కోటేశ్వరరావు, బి.సుబ్బలక్ష్మి, బి.పరమేశ్వరి, శంకరరావు, వియ్యాపు రాజు పాల్గొన్నారు.

20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ఈనెల 20న 'జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం' సందర్భంగా 19 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఆల్బెండ జోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో కలిసి ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పీపీపీ విధానం.. పేదలకు వైద్యం దూరం

- సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

అనకాపల్లి: ప్రభుత్వ ఆస్పత్రులను ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించి, నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పడం బడుగు, బలహీన వర్గాల ప్రజలకు వైద్యాన్ని దూరం చేయడమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముద్దుగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) అని పేరు పెట్టి పేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ప్రతి నియోజకవర్గంలో ఆస్పత్రులు నిర్మిస్తామని చెప్పి, ఇప్పటికే ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆస్పత్రులను సక్రమంగా నడపకలేకపోతున్నారని ఆయన పేర్కొన్నారు. పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో లేక రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇటీవల కాలంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు వస్తే రక్తపరీక్షలు చేయడానికి పరీక్ష కిట్లు లేని స్థితి ఏర్పడిందని చెప్పారు. వైద్యానికి ఇవ్వాల్సిన బడ్జెట్‌ను కేటాయించకుండా.. టెలిమెడిసిన్ పేరుతో వరల్డ్ బ్యాంకు నుంచి రూ. 2300 కోట్లు నిధులు తెస్తామని, కార్పొరేట్ స్థాయిలో సేవలందిస్తామని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు.

జిల్లాలో 750 గోకులం షెడ్లు మంజూరు

నాతవరం: జిల్లాలో మొదట విడత కింద 750 గోకులం షెడ్లు మంజూరయ్యాయని పాయకరావుపేట పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీనివాస్ చెప్పారు. ఆయన మంగళవారం నాతవరం పశువైద్యశాలలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సముద్ర ప్రాంతంలో ఉన్న మండలాలకు 50, ఇతర మండలాలకు 25 చొప్పున ప్రభుత్వం షెడ్లు మంజూరు చేసిందన్నారు. పశువులు, గొర్రెలు, మేకల కోసం ఈ షెడ్లు నిర్మిస్తారని ఉపాధి హామీ పథకం నిధులతో వీటిని చేపడతారన్నారు. నాతవరం ఇన్‌చార్జి పశు వైద్యాధికారి నరేష్, గునుపూడి పశువైద్యాధికారి మోక్షారెడ్డి, గోపాలమిత్రలు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యంతో పట్టుబడ్డ వ్యక్తిపై కేసు

అనకాపల్లి : అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై మంగళవారం కేసు నమోదయింది. పట్టణ హెచ్‌సీ ఎస్.రామకృష్ణ తెలిపిన వివరాలివి. పరవాడ మండలం లంకెలపాలెం గ్రామం గొల్లపేటకు చెందిన అప్పారావు 12 మద్యం క్వార్టర్ బాటిళ్లు అనకాపల్లి నుంచి లంకెలపాలెం తీసుకుని వెళుతుండగా, సుంకరమెట్ట జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలో పోలీసులకు పట్టుపడ్డాడు. మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

నిర్వాసితుల సర్వే లోపభూయిష్టం

- అర్హులైన వారికి అన్యాయం
- తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల ఆందోళన



నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసితులకు మద్దతు ప్రకటిస్తున్న వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు

నక్కపల్లి : విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా భూములు, ఇళ్లు , పశువుల పాకలు కోల్పోయిన నిర్వాసితుల గుర్తింపు లోపభూయిష్టంగా ఉందని, అర్హులకు అన్యాయం జరుగుతోందని పలువురు రైతులు మంగళవారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. రైతుల ఆందోళనకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా చందనాడ, రాజయ్యపేట, తదితర గ్రామాలకు చెందిన పలువురు రైతులు మాట్లాడుతూ తామంతా కోస్టల్ కారిడార్ నిర్మాణం కోసం ఏపీఐఐసీ వారికి భూములు ఇచ్చామని, పరిహారం చెల్లించినప్పటికీ పశువుల షెడ్లు, ఇతర నిర్మాణాలకు సంబంధించి గుర్తింపు, పరిహారం చెల్లింపు లోపభూయిష్టంగా ఉందని అన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రత్యేక ప్యాకేజీ చెల్లించకుండా సర్వే చేసి ఇళ్లు ఖాళీ చేయించాలని చూస్తున్నారన్నారు. గతంలో సర్వే సమయంలో తాము నివాసం ఉన్నచోటే ఈ షెడ్ల నిర్మాణాలు ఉన్నాయని అప్పుడు సర్వే చేసిన అధికారులు వాటిని పక్కన పెట్టి మళ్లీ సర్వే మొదలు పెట్టారన్నారు. ప్రస్తుతం తామంతా నివాస ప్రాంతాలను వేరే చోటికి మార్చుకోవడం జరిగిందన్నారు. తాజా సర్వేలో కేవలం షెడ్ల వద్ద మాత్రమే సర్వే చేస్తున్నారని, దీని వల్ల ఇళ్లు, షెడ్లకు రావాల్సిన నష్టపరిహారం, ప్యాకేజీలో బాధితులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. షెడ్లలకు పరిహారం చెల్లించి ఇళ్లకు ఫొటోలు తీస్తున్నారని, ఇలా చేసి ఇళ్లకు కూడా పరిహారం చెల్లించినట్టు చూపించి ఖాళీ చేయించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు వీసం రామకృష్ణ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వచ్చాక నిర్వాసితులకు అన్యాయం చేసే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. పూర్తి స్థాయి పరిహారం ఇవ్వకుండా భూములు స్వాధీనం చేసుకుని పనులు మొదలు పెట్టాలని చూస్తున్నారన్నారు. రైతులు కోరిన విధంగా నష్టపరిహారం చెల్లించకపోతే ఎటువంటి పోరాటానికైనా సిద్ధమన్నారు. సీపీఎం నాయకులు అప్పలరాజు మాట్లాడుతూ ప్రస్తుత ధరల ప్రకారం ఇళ్లకు, షెడ్లకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చేతి వృత్తుల వారికి, నిర్వాసితుల్లో మేజర్లకు ప్రత్యేక ప్యాకేజీ కింద ఎంత చెల్లిస్తారో ప్రకటించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ ఆందోళనలో సర్పంచ్ తళ్ల భార్గవ్, రైతు నాయకులు తళ్ల అప్పలస్వామి, పోతురాజు, చినతల్లి, రమణ, నాగేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

డొంకాడలో ఇల్లు దగ్ధం

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం
- కాలిపోయిన రూ.70 వేల నగదు



అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన అప్పలకొండ దంపతులు



కాలిపోయిన కరెన్సీ నోట్లు

నాతవరం : మండలంలో ఎం.బెన్నవరం పంచాయతీ శివారు డొంకాడ గ్రామానికి చెందిన బొర్ర అప్పలకొండ ఇల్లు విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో సోమవారం రాత్రి కాలిపోయింది. ఎప్పటిలాగే సాయంత్రం భోజనం చేసి గ్రామంలో తన కుమార్తె ఇంటికి అప్పలకొండ, అతని భార్య కలిసి వెళ్లారు. కుమార్తె ఇంట్లో కబుర్లు చెప్పుకుంటుండగా ఒక్కసారిగా అప్పలకొండ తాటాకు ఇంటిలో మంటలు చెలరేగుతున్నాయి. చుట్టుపక్కల వారంతా కేకలు వేయడంతో వెంటనే పరుగున వెళ్లి స్థానికులతో కలిసి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే గాలి బాగా వీయడంతో చూస్తుండగానే ఇల్లు దగ్ధమైంది. మంటలు వ్యాపించే సమయంలో లోపలకు వెళ్లి డబ్బులు, సామగ్రి తీసేందుకు ప్రయత్నించగా సమీపంలో గ్యాస్ బండ నుంచి మంటలు చెలరేగడంతో పేలిపోతుందన్న భయంతో లోపలకి వెళ్లే సాహసం చేయలేకపోయారు. దీంతో అందరూ చూస్తుండగానే ఇంట్లో ఉన్న దుస్తులు, సామగ్రి కాలిపోయాయి. తాటాకు ఇల్లు వర్షానికి కారిపోతుందని కొత్తగా ఇల్లు కట్టడానికి రెండు రోజుల క్రితమే రూ.70 వేలు తెచ్చి ఇంట్లో ఉంచిన నగదు కూడా మంటల్లో బూడిదైంది. అగ్నిప్రమాదంలో కట్టుబట్టలతో మిగిలిన బాధితులు భోరున విలపిస్తున్నారు. ప్రమాదంలో సుమారుగా రూ.3 లక్షలకు పైగా ఆస్తి నష్టం ఉంటుదని స్థానికులు తెలిపారు. బాధితులకు ములగపూడి గ్రామానికి చెందిన పాస్టరు ప్రసన్నకుమార్ ఓదార్చి ఆదుకున్నారు.

కత్తితో దాడి... ఇద్దరిపై కేసు నమోదు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు వెంకటశివ

అనకాపల్లి : క్షణికావేశంలో ఇద్దరు వ్యక్తుల నడుమ జరిగిన ఘర్షణలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం జరిగిన ఘటనపై రూరల్ అదనపు ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాలివి. మండలంలో బవులవాడ గ్రామానికి చెందిన జి.వెంకట శివ, అదే గ్రామానికి చెందిన వార్డు మెంబర్ వి.ఏసుల మధ్య ఘర్షణ జరగడంతో వెంకట శివను ఏసు కత్తితో పొడిచాడు. స్థానికల సహాయంతో అతనిని హుటాహుటీన అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ఏసుకు మద్దతుగా సింహాచలం అనే వ్యక్తి కూడా దాడికి పాల్పడినట్టు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

క్లుప్తంగా

వేడుకలకు హాజరు కావాలి

అనకాపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 15న 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పీవీవీఎం మోహన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులు తప్పని సరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కశింకోట : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు జరగనుందని ఎంపీడీవో కె. శేషుబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి తీర్మానాలు చేయకుండా శాఖల వారీగా సమీక్ష జరపనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పాఠశాలల్లో ఉత్సాహంగా ఆటల పోటీలు



కె.జె.పురం హైస్కూల్లో షటిల్ ఆడుతున్న విద్యార్థులు

మాడుగుల రూరల్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. మాడుగుల బాలుర, బాలికల హైస్కూళ్లు, కింతలి, ఒమ్మలి, వీరనారాయణం, కె.జె.పురం, జి.అగ్రహారం, ఎం.కోడూరు, గాదిరాయి హైస్కూళ్లతోపాటు ఎంపీపీ, యూపీ స్కూళ్లలో బాలబాలికలు ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొంటున్నారు. మంగళవారం వాలీబాల్, షటిల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ, స్కిప్పింగ్ తదితర ఆటలు ఆడారు. పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల సారథ్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో విజేతలకు స్వాతంత్య్ర దినోత్సవాన బహుమతులు ప్రదానం చేయనున్నారు.

వీరనారాయణంలో 104 వైద్య సేవలు

మాడుగుల: మండలంలోని వీరనారాయణం గ్రామంలో మంగళవారం 104 ద్వారా వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక రోగులతో పాటు వైరల్ జ్వరాలతో బాధపడుతున్న 170 మందిని గుర్తించి అవసరమైన మందుల్ని ఉచితంగా ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రసాద్‌పాత్రుడు, సిబ్బంది శంకరావు, రమణమ్మ, దేవి తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 86 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	4,390	4,390
మూడోరకం	3,180	3,300

అనకాపల్లి సినిమాలు

పాగల్ v/s కాదల్	: రాజా(మార్నింగ్, ఫస్ట్‌షో)
సంఘర్షణ	: రాజా(మ్యాట్నీ, సెకండ్‌షో)
కల్కి2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
తిరగబడరస్వామి	: వెంకటేశ్వర
సూపర్ డీలక్స్	: శ్రీసత్య
భవనమ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 66 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-38 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 415 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 361 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

వేపతో సాగు.. భలే బాగు

- రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే వేప ఉత్పత్తులు
- 300 రకాల కీటకాలకు సింహస్వప్నం
- పంట దిగుబడితో పాటు మానవులకు మేలు

వేప ఉత్పత్తులు వినియోగించుకుంటే అన్నదాతకు ఎంతో లాభం చేకూరుతుంది. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వరిలో చీడపీడ వ్యాధులు సోకినప్పుడు రైతులు ఎక్కువగా ఎరువులు వాడుతారు. వేప ఉత్పత్తులను ఇంట్లోనే తయారు చేసుకుని తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందే అవకాశాలున్నాయి.



వేప చెట్టు



మండలంలోని సీతానగరంలో కేఆర్‌బీ మిశ్రమం ద్వారా భూమిలో పొటాషియాన్ని వరి మొక్కకు అందించే ద్రవం కలుపుతున్న రైతులు

అనకాపల్లి : ఈ ఏడాది మండలంలో 5,600 ఎకరాల్లో వరినాట్లు వేసుకునేందుకు రైతులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే వెయ్యి ఎకరాల్లో వరినాట్లు వేశారు. ఈ దశలో వరికి చీడపీడ పట్టకుండా ఉపయోగించుకునే వేపలో అజాడిరాక్టిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది 300 రకాల కీటకాలు, సల్జాతి పురుగులు, చెదలు, భూమిలోని కొన్ని రకాల బూజు శిలీంధ్రాలను అరికట్టగలదు. వరి, పత్తి, అపరాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, కాఫీ, జొన్న, ఉద్యాన పంటలను ఆశించే కీటకాలను వేప అరికడుతుంది. మార్కెట్‌లో వేప పిండి, వేపనూనె, వేప కషాయం వంటి ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

ఇంట్లోనే వేప కషాయం తయారీ..

పంటలకు అవసరమైన వేప కషాయాన్ని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. 5 కిలోల వేపగింజలు నలగగొట్టి 6 నుంచి 7 లీటర్ల నీటిలో రెండు, మూడు రోజులు నానబెట్టాలి. దీన్ని వస్త్రంలో వడకట్టాలి. మరో 100 లీటర్ల నీటిని అందులో కలిపి వినియోగించాలి.

పొలాల్లో పిచికారీ..

వరి పైరుపై పురుగు ఆశించిన వెంటనే వేపనూనె పిచికారీ చేయాలి. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన మరుక్షణమే ఇలా చేస్తే ఇంకా మంచిది. 3 నుంచి 5 మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్‌ను లీటరు నీటిలో కలిపి ఎకరాకు 20 లీటర్లు పిచికారీ చేస్తే పురుగులు చనిపోతాయి. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఉదయం, సాయంత్రం 7 నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. ఇలా చేసిన వెంటనే వర్షాలు పడినట్లయితే వర్షం తగ్గిన తర్వాత 5 గంటల్లో పిచికారీ చేయడం మంచిది.

తెగుళ్ల నివారణకు..

వివిధ రకాలైన పంటల్లో తెగుళ్ల నివారణకు వేప మందుల వాడకం ఉపయోగకరం. వరి పంటకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేపపిండిని దమ్ములో వేయడం ద్వారా కాండం తొలిచే పురుగు, ఉల్లికోడను నివారించవచ్చు. వరిపైరుపై లీటరు నీటికి 3 మిల్లీలీటర్లు చొప్పున కలిపిన ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్లు పిచికారీ చేస్తే అగ్గితెగులు, తొడిమికుళ్లు, పొడతెగులు, వరి తుంగ్రోవైరస్ వంటి తెగుళ్లనును నివారించవచ్చు.

సమర్థవంతంగా కీటకాల నివారణ..

నీమ్ ఆయిల్ స్థానిక వ్యవసాయ నిపుణుల సూచన మేరకు వినియోగిస్తే కీటకాలను నివారించచ్చు. ఈ మందును పిచికారీ చేసినప్పుడు పురుగులకు వికారం కలిగి పైరును నాశనం చేయకుండా ఉంటాయి. విషపూరిత అవశేషాలు ఉండవు. పక్షులు, మానవులు, మిత్రపురుగులు, తేనెటీగల వంటి జీవరాశులకు హాని కలగదు.

భూమిలోని పొటాషియం వినియోగించుకోవాలి..

భూమిలోని పొటాషియ్యాన్ని వెలికి తీసేది కేఆర్‌బీ బాక్టీరియా(పొటాషియం రిలీజింగ్ బాక్టీరియా). దీనిని పశువుల గెత్తంలో కలిపి వేసినట్లయితే భూమిలో ఉన్న కరగని పొటాషియాన్ని మొక్కకు అందే విధంగా చేస్తుంది. దీనివలన రైతుకు పొటాషియంపై వెచ్చించే ఖర్చు తగ్గుతుంది. కేఆర్‌బీ పూర్తి ధర రూ.300. దీనికి సగం ధరకి రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో దొరుకుతుంది. ఎకరాకి ఒక లీటరు మాత్రమే వాడాలి.

వేప మందులు ఉపయోగకరం..



వేప గింజలు, ఆకుల ద్వారా నూనె తీయవచ్చు. వేప పొడి మార్కెట్‌లో దొరుకుతుంది. కేఆర్‌బీని పశువుల గెత్తంలో కలిపి దమ్ము దున్నినట్లయితే వరి నాట్లు వేసిన తర్వాత భూమిలో పొటాషియం గ్రహించి పంటకు మేలు జరుగుతుంది. సేంద్రియ వ్యవసాయం ద్వారా రసాయన మందుల వాడకాన్ని తగ్గించవచ్చు. పంటకు, మానవుని ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. పంట నాణ్యంగా ఉండడమే కాకుండా దిగుబడి బాగుంటుంది.

– పి.రంగాచారి, వ్యవసాయశాఖ అధికారి

వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌ను కలిసిన నాయకులు



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన నాయకులు

అనకాపల్లి : మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని అనకాపల్లి మండల ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మంగళవారం కలిసారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మండల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర స్ఫూర్తిని చాటేలా 'హర్ ఘర్ తిరంగా'



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఏఆర్ఎస్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

అనకాపల్లి : ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలు ఈనెల 14వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామని, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం డాక్టర్ ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పాలిటెక్నిక్ విద్యార్థుల ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 2 నుంచి 13వ తేదీ వరకూ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చదరంగం, క్యారమ్స్ పోటీలు నిర్వహించామని, ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 15న బహుమతులు అందజేస్తామన్నారు. అంతకు ముందు విద్యార్థులు భారత్ మాతాకీ జై అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ ఎం.చారుమతి, శాస్త్రవేత్తలు జి.కుసుమ, డి.ఉమామహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీలో అందరూ పాల్గొనాలి..

తుమ్మపాల : దేశభక్తి, జాతీయ భావం, స్ఫూర్తిని పెంపొందించడం కోసం ఉద్దేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14 ఉదయం 9.30 గంటలకు స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుండి నెహ్రూ చౌక్, ఎన్టీఆర్ స్టేడియం వరకు తిరంగా యాత్ర/ర్యాలీ నిర్వహించనున్నట్లు కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కలెక్టర్ విజయక్రిష్ణన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొననున్న ఈ కార్యక్రమంలో నగరవాసులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని కోరారు.

ఈ-పంట నమోదుతో రైతులకు మేలు



పంట వివరాల నమోదును పరిశీలిస్తున్న ఏవో సోమశేఖర్



ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏవో రమాదేవి

కె.కోటపాడు: ఈ-పంట నమోదుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి పి.సోమశేఖర్ అన్నారు. మండలంలోని గొండుపాలెంలో వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంటలో వరి, చెరకు, సరుగుడు, మామిడి, జీడి, కూరగాయలు, పూలు, పండ్ల సాగు వివరాలను నమోదు చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 15 వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రకృతి విపత్తులు ఎదురయ్యే సమయాల్లో ఈ-పంటలో నమోదైన రైతులకు నష్టపరిహారం అందుతుందన్నారు. గత ఏడాది మండలంలో 9,800 మంది రైతులు 10,500 ఎకరాల్లో వేసిన పంటలను ఈ-పంట విధానంలో నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి మధు, వ్యవసాయశాఖ సహాయకుడు సుధీర్ పాల్గొన్నారు.

చీడికాడ: ప్రతి రైతు ఈ-పంటలో తమ సాగు వివరాలను నమోదు చేసుకోవాలని ఇన్‌చార్జి ఏవో రమాదేవి కోరారు. మంగళవారం ఆమె పలు గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ-క్రాప్ నమోదు ప్రారంభమైందన్నారు. పంట వేసిన ప్రతి రైతు, కౌలు రైతులు ఆయా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకుల వద్ద వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

అసంపూర్తిగా నిలిచిన సామాజిక భవనం



యడ్లవానిపాలెంలో అసంపూర్తి పనులతో నిలిచిపోయిన సామాజిక భవనం

కె.కోటపాడు: వారాడ శివారు యడ్లవానిపాలెంలో 17 ఏళ్లుగా సామాజిక భవన నిర్మాణం పూర్తికాక అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ఈ కమ్యూనిటీ భవన నిర్మాణ పనుల్ని 2007లో ప్రారంభించారు. అప్పుడు మంజూరైన నిధులతో శ్లాబ్ వరకు పనులు చేపట్టారు. ఆ తర్వాత నిధుల్లేవని సదరు కాంట్రాక్టర్ పనుల్ని మధ్యలోనే నిలిపేశారు. అప్పటి నుంచీ ఈ నిర్మాణం పూర్తికాని పరిస్థితి. దీంతో స్థానికులు దీన్ని శిథిలమైన ఎడ్ల బళ్లు, కర్రలు తదితర పనికిరాని సామగ్రికి ఆలవాలంగా మార్చేశారు. గ్రామంలో పండగలు, ప్రత్యేక సందర్భాల్లో సభలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సరైన వేదిక లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా దీనికి నిధులు మంజూరు చేసి, నిర్మాణాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

వారాడలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



సేవలు అందిస్తున్న వైద్యాధికారి సాయికిరణ్

కె.కోటపాడు: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు వ్యాధుల బారిన పడే పరిస్థితులు ఎక్కువగా ఉంటాయని, జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయికిరణ్ తెలిపారు. వారాడలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 133 మందికి సాధారణ వైద్య పరీక్షలతో పాటు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలను నిర్వహించారు. అవసరమైన మందుల్ని ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా, పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఎంఎల్‌హెచ్‌పీ సుమ, ఏఎన్ఎం సూర్యకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వర్షం.. రైతుల హర్షం



రోలుగుంటలో కురుస్తున్న వర్షం

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కురిసిన వర్షం రైతులకు ఊరటనిచ్చింది. గత నెలలో కురిసిన వర్షాలకు పంట భూముల్లో చేరిన నీటితో పల్లపు భూముల్లో దమ్ములు ముగించుకున్నారు. సమీప చెరువులు, కాలువల్లో నీటిని యంత్రాల సాయంతో భూముల్లోకి చేర్చి కొమరవోలు, శరభవరం, రోలుగుంట, లగుడు కొత్తూరు తదితర గ్రామాల్లో నాట్లు వేసుకున్నారు. జేపీ అగ్రహారం, వెలంకాయల పాలెం, కొంతలం తదతర మెట్ట ప్రాంతాల్లో మాత్రం నీరు చాలినంత లేక, నారు ఉన్నా దమ్ములు జరగలేదు. నాట్లు పడలేదు. కొందరు నీటి ఇంజిన్లతో సాగు పనులు జరిపినా, చాలా ప్రాంతాల్లో పదును లేక నాట్లు వేయలేదు. ఇలాంటి తరుణంలో కురిసిన వర్షం పంట చేలకు ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక జాగ్రత్తలతో తామర పురుగుల నివారణ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ శ్రీలత

అనకాపల్లి : వాతావరణ పరిస్థితులకు వరి నారుమడిలో పొడతెగులు ఆశించే అవకాశం ఉన్నందున హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్ల ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ టి.శ్రీలత తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తామర పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. నారుమడిలో బెట్ట పరిస్థితులు నెలకొన్నట్లయితే పొటాషియం నైట్రేట్ (మల్టికె) లేదా 19:19:19 రకం పది గ్రాములు లీటరు నీటిలో ఆకులు తడిచేల పిచికారీ చేసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల ఈ ఏడాది జనవరిలో నాటిన చెరకులో కాండం తొలిచే పురుగులు, వర్షాధార చెరకులో పీక పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు ట్రైకోగ్రామాఖిలోనిస్ గుడ్డు పరాన్న జీవిని ఎకరాకు 20,000చొప్పున (1 కార్డు) 7-10 రోజుల వ్యవధిలో 4-6 సార్లు విడుదల చేయాలన్నారు. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పెసర, మినుములో మారుక మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉందని క్లోరిపైరిఫాస్ 2.5 లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.3 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఆమె సూచించారు. రాగల వర్షాలను వినియోగించుకుని తొలిపూత దశలో ఉన్న వేరుశనగ పైరులో జిప్సం ఎకరాకు 200 కిలోల చొప్పున వేసుకుని గొప్పు తవ్వి, మొదళ్లకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలన్నారు. వేరుశనగలో టిక్కా ఆకుమచ్చ తెగులు వచ్చే అవకాశం ఉందని, నివారణకు మాంకోజెట్ 2 మిల్లీలీటర్లు లేదా హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

ప్రత్తిలో రసం పీల్చు పురుగులను నియంత్రించడానికి నాటిన 20,40,60 రోజులకు ఒకసారి మోనోక్రోటోపాస్ లేదా ఇమిడాక్లోప్రిడ్ మందును నాలుగు పాళ్ల నీటిలో 1:4 నిష్పత్తిలో కలిపి మొక్క కాండం మధ్య భాగాన ఒక అంగుళం మేర మందును బ్రష్‌తో అద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, వి.గౌరీ, బి.భవానీ, వి.చంద్రశేఖర్, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

బోధనతో పాటు, సమయపాలన తప్పనిసరి

నాతవరం: ఉపాధ్యాయులు సమయపాలనతో పాటు, విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ సూచించారు. మంగళవారం ఆయన గునుపూడి హైస్కూల్లో ఈ ప్రాంతంలోని ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం మెనూ విధిగా అమలు చేయాలన్నారు. మండలానికి ఈ ప్రాంత పాఠశాలలు మారుమూలన ఉండటంతో ఉపాధ్యాయులంతా విధిగా సమయపాలన పాటించాలన్నారు. హైస్కూల్‌లో ప్రధాన సమస్యలను హెచ్ఎం టి.శివజ్యోతిని అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో తొలిసారిగా ఈ ప్రాంతానికి రావడంతో హెచ్ఎం శివజ్యోతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు సీఆర్పీ పోలుపర్తి నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 500 మీటర్ల జాతీయ జెండా ఊరేగింపు



కార్యక్రమానికి సీఐ స్వామినాయుడిని ఆహ్వానిస్తున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ప్రతినిధులు

దేవరాపల్లి: స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మండల కేంద్రం దేవరాపల్లిలో బుధవారం 500 మీటర్ల పొడవైన జాతీయ జెండా ఊరేగింపు ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కొరుపోలు శ్రీను మంగళవారం తెలిపారు. దేశ భక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వ హైస్కూల్ నుంచి ప్రారంభమై నాలుగు రోడ్ల కూడలి మీదుగా సినిమా థియేటర్ వరకు ఊరేగింపు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా కె.కోటపాడు సీఐ బి.స్వామినాయుడు, ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అప్పలరాజు, ఎంఈవోలు పడాల్‌దాస్, వి.ఉషారాణి తదితరులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన



ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రకృతి సేద్యం స్టాల్‌ను సందర్శిస్తున్న రైతులు

రోలుగుంట: ప్రకృతి వ్యవసాయం, పంట దిగుబడిపై ఆ శాఖ మండల ఇన్‌చార్జి నిర్మలాకుమారి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సిబ్బందితో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రకృతి సేద్యంలో పండించిన కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. స్టాల్ వద్దకు వచ్చిన రైతులకు, సందర్శకులకు ప్రకృతి సేద్యం గురించి వివరించారు. కార్యక్రమంలో ఆ శాఖ ఎల్ఐ మోదినాయుడు, గ్రామస్థాయి కార్యకర్తలు వై.గంగాభవాని, కె.నాగకాంతం, రాము, రమణ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్

నర్సీపట్నం: ఇండిపెండెన్స్ డేను పురస్కరించుకుని డినెట్ స్పోర్ట్స్ గ్రౌండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు మంగళవారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 12 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో మాంటిసోరి, నలంద జట్లు తలపడగా మోంటిసోరీ స్కూల్ విద్యార్థులు విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు.